సాక్షి
సంగారెడ్డి
శుక్రవారం ׀ 16 ׀ ఆగస్టు ׀ 2024


విద్యార్థుల నృత్య ప్రదర్శన

ఇది ప్రజా ప్రభుత్వం

- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ పాలన
- అన్ని రంగాల సమగ్ర అభివృద్ధే లక్ష్యం
- వ్యవసాయాన్ని పండగలా మార్చుతాం
- స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి దామోదర రాజనర్సింహ
- పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన మంత్రి

జిల్లావ్యాప్తంగా 78వ స్వాతంత్ర్య వేడుకలను అట్టహాసంగా జరుపుకొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. వివిధ సంఘాలు, పార్టీ కార్యాలయాల్లో త్రివర్ణ పతాకాలు రెపరెపలాడాయి. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన వేడుకల్లో మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని తెలిపేలా శకటాలను ప్రదర్శించారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, కలెక్టర్ క్రాంతి, ఎస్పీ రూపేష్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, మునిసిపల్ ఛైర్మన్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న మంత్రి దామోదర


సంగారెడ్డి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండా ఎగురవేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చే దిశగా తమ ప్రభుత్వం కృషి చేస్తోందని వైద్య ఆరోగ్య, సైన్స్, టెక్నాలజీ శాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. 60 ఏళ్ల సాగిన సుదీర్ఘ పోరాటాలు, అమరుల త్యాగాలు, అప్పటి యూపీఏ ప్రభుత్వ సహకారంతో తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర కల సాకారమైందన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని గురువారం స్థానిక పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. వ్యవసాయం దండగ కాదు, పండగ అని, పేదలకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. మహిళా సాధికారికత, యువతకు నైపుణ్యంతో కూడిన ఉపాధి, నిరుపేద విద్యార్థులకు ఆర్థిక భరోసా, అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ముందుకెళుతున్నామన్నారు.

నిరంతరం ప్రజాపాలన కార్యక్రమం

''ప్రజల చెంతకే ప్రభుత్వ యంత్రాంగం వెళ్లి ఆరు గ్యారెంటీల పథకాలకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించాం. ఈ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తాం. మహాలక్ష్మి పథకం కింద మహిళలందరికీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం. బస్సులలో ఉచితంగా 1.22 కోట్ల ప్రయాణాలను మహిళలు చేశారు. రూ.158 కోట్లు టికెట్ చార్జీలు మహిళలకు ఆదా అయింది. మహాలక్ష్మి పథకం కింద రూ.500కే గ్యాస్ సిలిండర్ సరఫరా చేసే కార్యక్రమంలో 1.58 లక్షల మంది వినియోగదారులకు సబ్సిడీ సిలిండర్లు అందించాం. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించుకునే 1.03 లక్షల గృహ వినియోగదారులకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. రైతుభరోసా పథకం కింద ఎకరానికి రూ.15 వేలు చెల్లించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇండ్లు నిర్మిస్తాం. చేయూత పథకం ద్వారా 1.58 లక్షల మంది లబ్ధిదారులకు ప్రతినెలా రూ.36 కోట్లను వివిధ పింఛన్లు అందిస్తున్నాం. రుణమాఫీ పథకం కింద ఇప్పటి వరకు 77,861 మంది రైతులకు రూ.564 కోట్లు పంట రుణాలను మాఫీ చేశాం. మూడో విడతలో రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తాం..'' అని మంత్రి దామోదర పేర్కొన్నారు.


విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

రూ.250 కోట్లతో 500 పడకల ఆస్పత్రి

''సంగారెడ్డిలో రూ.250 కోట్లతో 500 పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఇప్పటి వరకు 12,621 మందికి రూ.28.27 కోట్లు ఖర్చు చేసి వివిధ రకాల శస్త్ర చికిత్సలు చేశాం. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా 756 పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నాం. మహిళా సంఘాలకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.927 కోట్లను బ్యాంకు లింకేజీ రుణాలను మంజూరు చేశాం. ఇందిర మహిళా శక్తి పథకం కింద 6,600 మంది మహిళలకు లబ్ధి చేకూర్చుతున్నాం. వన మహోత్సవంలో భాగంగా 27 లక్షల మొక్కలు నాటాం. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా 7,909 మెట్రిక్ టన్నుల సబ్సిడీ బియ్యాన్ని నిరుపేదలకు పంపిణీ చేశాం. మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. సంగారెడ్డి నార్కోటిక్ అనాల్సిస్ బ్రాంచ్‌ను ఏర్పాటు చేశాం. సైబర్ నేరాల నుంచి విముక్తి కల్పించడానికి డీఎస్పీ స్థాయి అధికారితో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాం.'' అని మంత్రి వివరించారు.


బోనంతో విద్యార్థి



అంబేడ్కర్, మండేలా మాటలను..

'దేశం అభివృద్ధి చెందడం అంటే అద్దాల మేడలో రంగుల గోడలు కాదు. పౌరుల నైతిక అభివృద్ధే నిజమైన దేశాభివృద్ధి' అన్న అంబేడ్కర్ మాటలు ప్రతీ ఒక్కరు ఆచరణీయమంటూ మంత్రి తన ప్రసంగాన్ని ప్రారంభించారు. 'స్వేచ్ఛగా ఉండటం అంటే కేవలం ఒకరి బంధనాల నుంచి విడిపోవడమే కాదు.. ఇతరుల స్వేచ్ఛను గౌరవించే, పెంచే జీవన విధానం' అంటు నెల్సన్ మండేలా మాటలను గుర్తు చేసుకుంటూ తన ప్రసంగాన్ని ముగించారు. వేడుకల్లో కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ చెన్నూరి రూపేష్, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాల సభ్యులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.


విద్యార్థి నృత్య ప్రదర్శన


జిల్లా పంచాయతీరాజ్ శాఖ శకటం

కలెక్టరేట్‌లో..


కలెక్టరేట్‌లో జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి టౌన్ : కలెక్టరేట్‌లో స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ క్రాంతి జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీస్ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్, అదనపు కలెక్టర్లు మాధురి, చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో..


జిల్లా కోర్టు ఆవరణలో జెండా ఆవిష్కరిస్తున్న జడ్జి భవాని చంద్ర

జిల్లా కోర్టు ఆవరణలో స్వాతంత్ర్య వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవాని చంద్ర జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా పోలీస్ కార్యాలయంలో..

సంగారెడ్డి : స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ చెన్నూరి రూపేష్ జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం సిబ్బందితో కలిసి జాతీయ గీతాలాపన చేశారు.

మూడో విడతలో 3వ స్థానం

రుణమాఫీలో రాష్ట్రంలో జిల్లా స్థానం

- 16,676 రైతు కుటుంబాలకు రూ.281 కోట్లు మాఫీ
- లెక్కతేల్చిన ప్రభుత్వం
- మూడు విడతల్లో కలిపి 98,518 మంది రైతులకు రూ.848.03 కోట్ల రుణ విముక్తి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : మూడో విడతలో అత్యధిక పంట రుణాలు మాఫీ అయిన జాబితాలో సంగారెడ్డి జిల్లా మూడో స్థానంలో నిలిచింది. ఈసారి జిల్లాలో 16,676 రైతు కుటుంబాలకు సంబంధించిన రూ.281.65 కోట్లు మాఫీ అయ్యాయి. రూ.442.86 కోట్ల పంట రుణాలు మాఫీ అయిన నల్గొండ జిల్లా మొదటి స్థానంలో ఉండగా, రూ.286.26 కోట్ల రుణాల మాఫీతో ఆదిలాబాద్ జిల్లా రెండో స్థానంలో నిలిచింది. రూ.1.50 లక్షల నుంచి రూ.రెండు లక్షలలోపు పంట రుణాలను ప్రభుత్వం మూడో విడతలో మాఫీ చేసింది. ఈ రుణమాఫీ అయ్యే రైతుల లెక్కను రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. రుణమాఫీ అయిన రైతుల ఖాతాల్లో ప్రభుత్వం రేపు నగదును జమ చేయనుంది.

ఇప్పటికే రెండు విడతల్లో పంట రుణమాఫీ చేసిన విషయం విదితమే. గత నెల జూలై 18న చేసిన మొదటి విడతలో జిల్లాలో 51,167 మంది రైతులకు సంబంధించిన రూ.279.62 కోట్ల పంట రుణాలు మాఫీ అయిన విషయం తెలిసిందే. అలాగే జూలై 30న చేసిన రెండో విడతలో 27,249 మంది రైతులకు సంబంధించిన రూ.286.76 కోట్లు మాఫీ అయ్యాయి. ఈసారి దాదాపు అదే స్థాయిలో రూ.281.65 కోట్ల పంట రుణాలు మాఫీ అవుతున్నాయి. ఇలా మూడు విడతల్లో కలిపి మొత్తం



98,518 మంది రైతులకు సంబంధించిన రూ.848.03 కోట్ల మేరకు పంట రుణాలు మాఫీ అయ్యాయి.

తొలి రెండు విడతల్లో మాఫీకాని రైతుల పరిస్థితి

ప్రభుత్వం తొలిరెండు విడతల్లో చేసిన పంట రుణ మాఫీ ప్రక్రియలో జిల్లాలో వేలాది మంది రైతుల పంట రుణాలు మాఫీ కాలేదు. తొలి విడతలో రూ.లక్షలోపు పంట రుణమున్న రుణాలన్నింటినీ, రెండో విడతలో రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షలలోపు రుణాలను మాఫీ చేసిన విషయం విదితమే. అయితే అర్హులైన చాలామంది రైతుల రుణాలు మాఫీ కాలేదు. జిల్లాలోని సహకార రంగంలోని ఉన్న డీసీసీబీ బ్యాంకుల్లో రుణాలు పొందిన రైతుల్లో సుమారు 40 శాతం మంది రైతుల రుణాలు మాఫీ కాలేదు. అలాగే ఇండియన్ బ్యాంక్ వంటి జాతీయ బ్యాంకుల్లో ఖాతాలున్న వందలాది మంది అర్హులైన రైతుల పంట రుణాలు కూడా మాఫీ కాలేదు. దీంతో తమ రుణాలు ఎందుకు మాఫీ కాలేదోనని రైతులు బ్యాంకుల చుట్టూ, మరోవైపు వ్యవసాయశాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. మాఫీ డబ్బులు జమ కాని రైతులకు సంబంధించిన ఆధార్ కార్డులతో వ్యవసాయశాఖ ఆన్‌లైన్ పోర్టల్‌లో పరిశీలిస్తే వివిధ కారణాలు చూపుతోంది. ప్రధానంగా రైతు ఆధార్ నంబర్ తప్పుగా నమోదు కావడం, నో డాటా ఫౌండ్ (రైతు పేరు కనిపించకపోవడం), ఆధార్‌లోని పేరుకు రుణ ఖాతాలోని పేరు వేరుగా ఉండటం, కుటుంబ సభ్యుల నిర్ధారణ చేయాల్సి ఉండటంతో పాటుగా రుణఖాతాలోని పేరు వేరుగా ఉండటం, కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగుల పింఛన్లు తీసుకున్న వారు ఉండటం, పట్టాదారు పాసుపుస్తకం లేకపోవడం, ప్రభుత్వ ఉద్యోగి ఉండటం, పాసుపుస్తకం లేకపోవడంతో పాటు ఆధార్‌లో వేరే పేరు ఉండటం ఖాతాలో మరో పేరుండటం, రేషన్‌కార్డు లేకపోవడం, డీబీటీ ఇష్యూ ఆర్బీఐ ఖాతాలో జమ కావడం, బ్యాంకులో ఒక ఐడీ నంబర్‌పై ఇద్దరు, ముగ్గురు పేరు ఉండటం, రైతు మరణించడం, రుణం కంటే వడ్డీ మించిపోవడం, వేర్వేరు కుటుంబాలకు చెందిన రైతులు ఒక కుటుంబంగా నమోదు కావడం, ఖాతా నంబర్ తప్పుగా నమోదు కావడం, ఒకే అకౌంట్ నంబర్‌పై ఎక్కువ మంది రైతులు ఉండటం, రైతు చనిపోవడం, ఒక ఆధార్ నంబర్ ఎక్కువ మంది రైతుల పేరుకు అటాచ్ కావడం, ఇతర కారణాలు అర్హులైన రైతులకు రుణ మాఫీ కాకపోవడానికి వ్యవసాయశాఖ పోర్టల్‌లో చూపుతోంది. మాఫీ కాని రైతుల రుణాలు వచ్చే విడతలో మాఫీ అవుతాయని అధికారులు రైతులకు సర్ది చెప్పారు. ఈ మూడో విడతలో ఎవరెవరి రైతుల రుణాలు మాఫీ అవుతాయనే దానిపై నేడు స్పష్టత వచ్చే అవకాశాలు ఉన్నాయి.

ఉమ్లాతండా పంచాయతీలో చేర్చవద్దు


ఎమ్మెల్యే సంజీవరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కారోబారి తండావాసులు

నారాయణఖేడ్: నాగలిద్దా మండలంలోని శాంతినగర్ తండా పంచాయతీలో ఉన్న ఉమ్లా తండాను కొత్త పంచాయతీగా ఏర్పాటుకు గెజిట్ నోటిఫికేషన్ జారీ అయిన విషయం తెలిసిందే. అయితే ఉమ్లా తండాలో తమ తండాను చేర్చవద్దంటూ గురువారం శాంతినగర్ పంచాయతీ పరిధిలోని కారోబారి తండావాసులు ఎమ్మెల్యే సంజీవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. గెజిట్ ప్రకారం తమ తండాను నూతనంగా ఏర్పాటయ్యే ఉమ్లాతండా పరిధిలో చేర్చారని తెలిపారు. కారోబారితండా నుంచి ఉమ్లాతండాకు వెళ్లడానికి రెండుకిలోమీటర్ల దూర భారం కావడంతో పాటు రెండు పెద్దవాగులు ఉండి వర్షాకాలంలో వెళ్లలేని పరిస్థితి ఉంటుందని వాపోయారు. అలాగే పరిపాలనాపరంగా సౌకర్యంగా ఉండదని తెలిపారు. అందువల్ల కారోబారితండాను ఉమ్లాతండా పంచాయతీలో కలపకుండా శాంతినగర్ తండా పంచాయతీలోనే కొనసాగించాలని కోరారు.

ఉపాధ్యాయుల సమస్య పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

జహీరాబాద్ టౌన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని, ప్రభుత్వం కూడా సానుకూలంగా ఉందని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు, టీబెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీరాం రాథోడ్‌కు డాక్టరేట్ దక్కినందుకు గురువారం పట్టణంలోని ఫంక్షన్‌హాల్‌లో అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బకాయపడిన డీఏలు త్వరలో వస్తాయని, ఉపాధ్యాయులకు సర్వీస్‌రూల్స్ రావడం ఖాయమన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు త్వరలో క్లియర అవుతాయని చెప్పారు. తులసీరాం రాథోడ్ ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ గిరిజనులను చైతన్య పరిచేందుకు గత 30 సంవత్సరాల నుంచి కృషి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి మదన్‌గోపాల్, టీబెస్ రాష్ట్ర అధ్యక్షులు పీపీ రాథోడ్, నాయకులు ముంజ నాయక్, ప్రభు, అర్జున్ చవాన్, దేవిసింగ్ రాథోడ్, దేవిసింగ్ చౌహాన్, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

విద్యతోపాటు క్రీడలకూ ప్రోత్సాహం


విద్యార్థులకు అవార్డుతోపాటు ధ్రువపత్రం అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

నారాయణఖేడ్: విద్యతోపాటు క్రీడలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. ఖేడ్ తహశీల్ గ్రౌండ్‌లో గురువారం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఫ్లాగ్‌మార్చ్, సాంస్కృతిక ప్రదర్శనలు తదితర అంశాలపై పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన వారికి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎమ్మెల్సీ రాములునాయక్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, డీఎస్పీ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈదురుగాలుల వర్షం.. నేలకొరిగిన చెట్లు


బాచేపల్లి వద్ద రోడ్డుపై అడ్డంగా పడిన చెట్టు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల శివారులో చెట్లు నేలకొరిగాయి. కల్హేర్, కృష్ణాపూర్, ఇందిరానగర్, బాచేపల్లి, సిర్గాపూర్ మండలంలోని సుల్తానాబాద్ తదితర గ్రామాల్లో రోడ్లపై అడ్డంగా చెట్లు విరిగిపడ్డాయి. దీంతో చాలా సమయం రాకపోకలకు అంతరాయం కలిగింది.

ఘనంగా తీజ్ వేడుకలు


తీజ్ వేడుకల్లో పాల్గొన్న టీపీసీసీ సభ్యులు కర్నె శ్రీనివాస్

నారాయణఖేడ్: మండల పరిధి ఆకలాయి తండాలో గురువారం తీజ్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గిరిజన మహిళలు, యువతులు సంప్రదాయ దుస్తులు ధరించి కోలాటం ఆడారు. తండాలోని భవానీమాత ఆలయాన్ని టీపీసీసీ సభ్యులు కర్నె శ్రీనివాస్ దర్శించుకొని పూజలు చేశారు.

రాఖీ పండగకు అదనపు బస్సులు

నారాయణఖేడ్: ఈనెల 19న రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ప్రయాణికుల సౌకర్యార్థం 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు అదనపు బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ ఆర్‌ఎం ఎం.ప్రభులత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రీజియన్ పరిధిలో ఆయా డిపోల్లో కలిసి మొత్తం 265 అదనపు సర్వీసులు నడిపిస్తామన్నారు. మెదక్, నారాయణఖేడ్, నర్సాపూర్, సంగారెడ్డి, జహీరాబాద్, సిద్దిపేట్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్, దుబ్బాక డిపోల పరిధిలో ఈ సర్వీసులు రద్దీకి అనుగుణంగా ఆయా రూట్లలో సర్వీసులు నడపడం జరుగుతుందన్నారు.

గోపన్‌పల్లిలో చిరుత కలకలం

జహీరాబాద్ టౌన్ : మొగుడంపల్లి మండలంలోని గోపన్‌పల్లి, అసద్‌గంజ్ గ్రామాల మధ్య గురువారం చిరుతపులి సంచారం కలకలం రేపింది. గోపన్‌పల్లి, అసద్‌గంజ్ గ్రామాల మధ్యన ఉన్న ఎర్రవాగు ప్రాంతంలో సంజీవ్‌రెడ్డి, ముబీన్ రైతుల పత్తి, సోయాబీన్ పంట పొలాల్లో చిరుతపులి తిరగడాన్ని స్థానికులు గమనించారు. దీంతో ఆ ప్రాంత రైతులు, గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న జహీరాబాద్ ఫారెస్టు సిబ్బంది చిరుత సంచరించిన ప్రాంతాలను సందర్శించి పరిశీలించారు. ఎలాంటి ఆనవాళ్లు కనిపించలేదని వారు చెప్పారు.

బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఎగరని జెండా

నారాయణఖేడ్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేయలేదు. ఈ విషయంలో అధికారులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల అభివృద్ధి సంఘం ఖేడ్ డివిజన్ అధ్యక్షుడు నరేందర్ డిమాండ్ చేశారు. కాగా పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జెండా ఎగురక మొరాయించింది. దీంతో జెండాను సదరు ప్రధానోపాధ్యాయులు కిందకు దించి తిరిగి ఎగురవేశారు.

క్లుప్తంగా

అంగన్‌వాడీలో చోరీ

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలం మర్పడ్గలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. రోజులాగే అంగన్‌వాడీ టీచర్ బుధవారం సాయంత్రం కూడా కేంద్రానికి తాళం వేసి వెళ్లింది. గుర్తు తెలియని వ్యక్తి తాళాలు పగులగొట్టి గ్యాస సిలిండర్‌ను ఎత్తుకెళ్లాడు. ఈ విషయమై టీచరు త్రీ టౌన్ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న 50 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ (రేషన్ బియ్యం)ను జగదేవ్‌పూర్ పోలీసులు పట్టుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం పుట్టగూడెంకు చెందిన మాలోతు శ్రీకాంత్ జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్ శివారులో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నాడనే సమాచారం మేరకు పోలీసులకు అందింది. దీంతో గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, జగదేవ్‌పూర్ ఎస్‌ఐ చంద్రమోహన్‌లు గురువారం తమ సిబ్బందితో కలిసి వెళ్లి దాడులు చేశారు. ఇందులో 50 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ అనుమతులు లేకుండా రేషన్ బియ్యం తరలించినా, నిల్వ చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఏఎస్‌ఐ రమణారెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ తాజుద్దీన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మిషన్‌లో ఇరుక్కుపోయి ఆపరేటర్ దుర్మరణం

పటాన్‌చెరు టౌన్: పనిచేసే చోట మిషన్‌లో ఇరుక్కుపోయి ఓ కార్మికుడు మృతిచెందాడు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బిహార్‌కు చెందిన వాజేంద్ర కుమార్ (29) బతుకుదెరువు కోసం 2015లో పటాన్‌చెరు మండలం పాశమైలారానికి వచ్చి పారిశ్రామికవాడలోని టైచి డై కాస్ట్ కంపెనీలో మిషన్ ఆపరేటర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 14న రాత్రి మిషన్ వద్ద పనిచేస్తుండగా మిషన్‌లో నుంచి అల్యూమినియం మెటీరియల్ తయారు చేసి బయటకు తీసే క్రమంలో మిషన్ డై మధ్యలో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పరిశ్రమ యజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే తన సోదరుడు మృతి చెందాడని వజేంద్ర సోదరుడు భగత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టి..

– బైకిస్టు మృతి

హత్నూర(సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన హత్నూరు మండలం నస్తీపూర్ గ్రామ శివారులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని సాదుల్‌నగర్‌కు చెందిన ఆందూరి వెంకటేశం (49) బుధవారం రాత్రి తెలిసిన వారి బైక్‌ను తీసుకొని కిరాణా సామాను కోసం దౌల్తాబాద్‌కు వెళ్లాడు. తిరిగొస్తుండగా నస్తీపూర్ గ్రామశివారులో గల సువర్ణ దుర్గ పేపర్ మిల్ కంపెనీ వద్ద రాగానే బైక్‌ను అతివేగంగా నడిపి కుడివైపునకు వెళ్లి ఎదురుగా వస్తున్న షిఫ్ట్ కారుకు ఢీ కొట్టాడు. దీంతో వెంకటేశం తలకు బలమైన రక్త గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రత్యక్ష సాక్షులు అతడి జేబు నుంచి ఫోన్ తీసుకొని అందులో నుంచి కూతురుకు సమాచారం తెలిపారు. వెంటనే కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శికి అవార్డు



అవార్డును అందుకుంటున్న సంతోష్‌కుమార్

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని గుంజోటి పంచాయతీ కార్యదర్శికి ఉత్తమ సేవా అవార్డు లభించింది. పంచాయతీ కార్యదర్శి సంతోష్‌కుమార్ గురువారం సంగారెడ్డిలో నిర్వహించిన స్వాంతంత్ర్య వేడుకల్లో మంత్రి రాజనర్సింహ, కలెక్టర్ వల్లూరి క్రాంతి చేతుల మీదుగా అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

ఉత్తమ సేవలకు అవార్డులు

ఉమ్మడి మెదక్ జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా ఆయా శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులు అవార్డులు, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. సిద్దిపేటలో మంత్రి పొన్నం, సంగారెడ్డిలో మంత్రి దామోదర చేతులమీదుగా అందజేశారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



మంత్రి దామోదర చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న ఎస్పీ రూపేశ్

ఎంఈఓకు ప్రశంసా పత్రం..

పటాన్‌చెరు: పటాన్‌చెరు, అమీన్‌పూర్ మండలాల విద్యాధికారి పీపీ రాథోడ్ ఉత్తమ ఎంఈఓగా ప్రశంసా పత్రాన్ని మంత్రి దామోదర రాజనర్సింహ చేతులమీదుగా జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశంసా పత్రం పొందడం సంతోషంగా ఉందన్నారు.



మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా పత్రం అందుకుంటున్న అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, అడిషనల్ కలెక్టర్ మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, అడిషనల్ ఎస్పీ సంజీవరావు, అందోల్ ఆర్డీఓ ఆర్ పాండు, నారాయణఖేడ్ ఆర్డీఓ అశోక చక్రవర్తి, జహీరాబాద్ ఆర్డీఓ ఎస్. రాజు, సంగారెడ్డి ఆర్డీఓ వసంత కుమారి, డీఎండబ్ల్యూ దేవుజ, ఎక్సైజ్ అధికారి నవీన్ చంద్ర, సీపీఓ బాలశౌరి, డీఆర్డీఓ జ్యోతి. (కుడి నుంచి ఎడమ).



డీడబ్ల్యూఓ లలితా కుమారి, డీఎంసీఎస్ కొండలరావు, ఎస్ఈ ట్రాన్స్‌కో మాధవరెడ్డి, డీపీఓ సాయిబాబా, కోఆపరేటివ్ ఆఫీసర్ తుమ్మ ప్రసాద్, అడిషనల్ డీఆర్డీఓ బాలరాజ్, ఎల్ఐసీ విద్యాసాగర్, ఏడీ సర్వే ల్యాండ్ ఐనేష్, జెడ్పీ సీఈఓ జానకీరెడ్డి, కలెక్టరేట్ ఏఓ పరమేశం, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు దశరథ్, అందోని గంగాధర్, మనూర్ తహసీల్దార్ వెంకటస్వామి, అందోల్ తహసీల్దార్ భాస్కర్ (కుడి నుంచి ఎడమ).



సంగారెడ్డి తహసీల్దార్ దేవదాస్, కోహిర్ తహసీల్దార్ బాల శంకర్, పటాన్‌చెరు తహసీల్దార్ రంగారావు, రాయికోడ్ తహసీల్దార్ విజయ్ కుమార్, తహసీల్దార్ కలెక్టరేట్ హరి చంద్ర ప్రసాద్ నయాబ్, తహసీల్దార్ గంగాధర్ గిర్దావర్ సదాశివపేట సంతోష్ కుమార్ నయాబ్, సర్వేయర్ కోటేశ్వరరావు, కలెక్టరేట్ ఎస్ఐసీ విజయ్ కుమార్, ఆర్ఐ రాజశేఖర్ రెడ్డి, యాదవ రెడ్డి, జహీరాబాద్ టౌన్ సీఐ శివలింగం, కానిస్టేబుల్ అన్వర్ పాషా, ఏఆర్ పోలీస్ ఎండీ రహమత్, ఏఆర్ పోలీస్ శోభారాణి, భరోసా కోఆర్డినేటర్ దేవలక్ష్మి.



సిద్దిపేటలో.. సీనియర్ అసిస్టెంట్ చక్రవర్తి, ఏఎన్ఎం కవిత, ఆశావర్కర్ అరుణ, ఉమెన్ అండ్ చైల్డ్ శాఖ ఇమ్రాన్‌ఖాన్, మెప్మా కోఆర్డినేటర్ హనుమంతరెడ్డి, ఎస్సీ స్టడీస్ సర్కిల్ డైరెక్టర్ శ్రీకాంత్, ఎంవీఐ శంకర్‌నారాయణ, రవాణా శాఖ పీసీ రవీందర్, రవాణా శాఖ ఏవో నజీర్ (ఎడమ నుంచి కుడికి).



సిద్దిపేటలో.. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్



అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి జయదేవ్‌ఆర్య, అటవీ శాఖ అధికారి శ్రీనివాస్, పశుసంవర్ధక శాఖాధికారి జగత్‌కుమార్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఓ అబ్దుల్‌రహిమాన్, హుస్నాబాద్ ఎంఆర్ఓ రవీందర్‌రెడ్డి, డీపీఓ దేవకీదేవి, సిద్దిపేట అర్బన్ ఎంఆర్ఓ సలీం మియా (ఎడమ నుంచి కుడికి)



చిన్నకోడూర్ ఎంఆర్ఓ జయలక్ష్మి, నాయబ్‌ఎంఆర్ఓ ఆశాజ్యోతి, నాయబ్ ఎంఆర్ఓ రాజేశం, నాయబ్ ఎంఆర్ఓ లావణ్య, పౌరసరఫరాలశాఖ అభిలాశ్, సబ్‌ట్రెజరీ ఆఫీసర్ నర్సింహ, హార్టికల్చర్ ఆఫీసర్ హుస్నాబాద్ బాలాజీ, హార్టికల్చర్ ఆఫీసర్ గజ్వేల్ సౌమ్య (ఎడమ నుంచి కుడికి)



సీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, సీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, ఇన్‌స్పెక్టర్ తోగుట లతీశ్, సీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, సబ్‌ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి, ఏఆర్ ఎస్ఐ శ్రీనివాస్, సీపీఓ అసిస్టెంట్ సాయిసుమంత్‌రెడ్డి, పీసీ మధుసూదన్(ఎడమ నుంచి కుడికి)





ఎఫ్ఆర్ఓ దుబ్బాక సందీప్‌కుమార్, డిప్యూటీ ఎఫ్ఆర్ఓ చేర్యాల లింగామూర్తి, డిప్యూటీ ఎఫ్ఆర్ఓ శనిగరం గోపాల్‌రెడ్డి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ములుగు ప్రసాద్, అగ్నిమాపక అధికారి గజ్వేల్ కుమార్, అగ్నిమాపక పీసీ నరేశ్, డీపీఎం కరుణాకర్‌రావు, డీఆర్‌డీఓ సీసీ ప్రతాప్‌కుమార్, వైద్యాశాఖ నర్సింహులు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్య

అనారోగ్యంతో ఒకరు..
కడుపునొప్పి భరించలేక మరొకరు..

బెజ్జంకి(సిద్దిపేట): అనారోగ్యంతో మనస్తాపం చెందిన వృద్ధుడు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని గుగ్గిల్ల గ్రామంలో జరిగింది. ఏఎస్‌ఐ శంకర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుగ్గిల్ల దుర్గయ్య(70) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలుమార్లు కరీంనగరలోని ఆస్పత్రుల్లో వైద్యం చేయించారు. అయినప్పటికీ నయం కాకపోవడంతో మనస్తాపం చెంది ఇంటి వద్దే గురువారం క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ దుర్గయ్య మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్దకుమారుడు మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

– పటాన్‌చెరు టౌన్: కడుపునొప్పి భరించలేక మహిళా ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహేశ్వర్ రెడ్డి కథనం ప్రకారం... బిహార్‌కు చెందిన సికిందర్ కుమార్ రెండు సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం వచ్చి గుమ్మడిదల పరిధిలోని దోమడుగులో ఉంటూ లేబర్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత కొంతకాలంగా సికిందర్ భార్య అర్థిదేవి(24) కడుపునొప్పి సమస్యతో బాధపడుతూ మాత్రలు వాడుతోంది. గురువారం ఆమె ఇంట్లో ఉండగా భర్త సిలిండర్ తీసుకు రావడానికి గండి మైసమ్మకు వెళ్లాడు. స్కూల్‌కు వెళ్లిన వీరి కుమారుడు దేవరాజ్ 11:30 గంటలకు వచ్చి చూసేసరికి తల్లి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని కనిపించింది. దీంతో స్థానికులు మృతురాలి సోదరుడు చందన్ కుమార్‌కు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకొని కిందికి దింపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



అర్థిదేవి (ఫైల్)

వైర్ల విక్రయానికి వచ్చి.. పోలీసులకు చిక్కి..

నలుగురిని అరెస్టు

సిద్దిపేటకమాన్: రాత్రి సమయాల్లో వ్యవసాయ బావుల వద్ద బోరు మోటార్ల వైర్లను దొంగతనం చేస్తున్న నలుగురిని గురువారం సిద్దిపేట టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట రేణుకానగర్‌కు చెందిన పర్వతం పోచయ్య అతడి కుమారుడు పర్వతం రాకేశ్, తమ్ముడు హనుమాన్ నగర్‌కు చెందిన పర్వతం రాజు అలియాస్ రాజయ్య, వీరి స్నేహితుడైన మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం ఖాజీపూర్‌కు చెందిన కర్రె కమార్ నలుగురు కలిసి గత సంవత్సరం నుంచి రాత్రి సమయంలో వ్యవసాయ బావుల వద్ద వైర్లు దొంగతనాలకు పాల్పడ్డారు. రామంచ, జక్కాపూర్, మర్కూక్ మండలం నర్సన్నపేట, పెద్దకోడూరు సబ్‌స్టేషన్, ఎల్లుపల్లి, ఐక్రిచెప్యాల, ఇమాంబాద్ గ్రామాల్లోని వ్యవసాయ బావుల వద్ద మోటార్లు, సర్వీసు వైర్లను దొంగలిస్తున్నారు. వాటిని కాల్చగా వచ్చిన రాగి వైరును గుర్తు తెలియని వ్యక్తులకు అమ్ముకుంటూ వచ్చిన డబ్బులతో ఖర్చు పెట్టుకునేవారు. కాగా, దొంగిలించి రాజీవ్ రహదారి పక్కన ఎల్లమ్మగుడి, నర్సాపూర్ సమీపంలో చెట్ల పొదల్లో దాచిన వైరును విక్రయించడానికి ప్రయత్నిస్తుండగా పెట్రోలింగ్ పోలీసు సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఆరు నెలల క్రితం పర్వతం పోచయ్య కరీంనగర్ బస్టాండ్ సమీపంలోని వైన్ షాప్ వద్ద దొంగిలించిన టీవీఎస్ ఎక్సెల్ వాహనం, 250 మీటర్ల సర్వీసు వైరు, దొంగతనం చేయడానికి ఉపయోగించిన టార్చ్‌లైట్, కట్టరులను స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.



నిందితులను చూపుతున్న సీఐ ఉపేందర్, సిబ్బంది

వ్యక్తి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి చెప్పకుండా బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బీమ్ సింగ్ ఈనెల 10న బతుకుతెరువు కోసం వచ్చి అమీన్‌పూర్ పరిధిలోని సూర్య గ్లోబల్ స్కూల్ సమీపంలో గుడిసెలో ఉంటూ, లేబర్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 13న పనికి వెళ్లి తిరిగి సాయంత్రం నివాసం ఉంటున్న చోటుకు వచ్చి ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి ఎంతకీ రాలేదు. అల్లుడు హరిలాల్ మామ అదృశ్యంపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



గణేశ్ (ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని కొర్విపల్లి వద్ద రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈనెల 12న మెదక్ నుంచి మాసాయిపేటకు బైక్‌పై గుట్టకింది పల్లికి చెందిన చాకలి గణేశ్(23) వస్తున్నాడు. కొర్విపల్లి వద్ద ఇతను ప్రయాణిస్తున్న బైక్, ఇంకొక ద్విచక్ర వాహనం రెండూ ఢీకొన్నాయి. దీంతో తీవ్రగాయాలకు గురైన అతడిని మెదక్ ఏరియా హాస్పిటల్ తరలించారు. మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఇక్కడ చికిత్స పొందుతూ గురువారం గణేశ్ మృతిచెందాడు. అతని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గాయపడిన వివాహిత..

సిద్దిపేటకమాన్: కుటుంబ కలహాలతో భర్త చేతిలో గాయపడిన భార్య ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. వివరాల ప్రకారం.. పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో నీలం సరిత రాజు దంపతులు నివాసం ఉంటున్నారు. ఈనెల 10న కుటుంబ కలహాలతో నేపథ్యంలో భార్య ముఖంపై భర్త గ్రానైట్ రాయితో దాడి చేసి గాయపర్చాడు. కాగా పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ గురువారం మృతి చెందింది. వన్ టౌన్ పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు నిందితుడిని ఆదివారమే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం తెలిసిందే.

జనగామ వద్ద నిందితుడి అరెస్టు

పరారీలో మరో ఇద్దరు : సీఐ శ్రీనివాస్

అక్కన్నపేట(హుస్నాబాద్): భూ తగాదాలో సొంత అన్నను హతమార్చిన హత్య ఘటనలో ఒకరిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అక్కన్నపేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో గురువారం హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్ వివరాలను వెల్లడించారు. ఈ నెల 12న అక్కన్నపేట మండలం మసిరెడ్డితండా గ్రామంలో భూ తగాదాల విషయంలో సొంత అన్న గుగులోతు రాజు (43)ను పథకం ప్రకారం మరదలు లలీత, తమ్ముడు భీమా, అతని కుమారుడు అనిల్ కలిసి కర్రలు, పైపులతో కొట్టి చంపేశారన్నారు. దీంతో జనగామ గ్రామ క్రాసింగ్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా నిందితుడు భీమాను అదుపులో తీసుకొని రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు. అలాగే అతడి బైక్‌ను స్వాధీనం చేసుకొని సీజ్ చేశామన్నారు. మిగతా నిందితులు లలీత, అనిల్ పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలో పట్టుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్సై విజయ్‌భాస్కర్, హెడ్‌కానిస్టేబుల్స్ రమేశ్, కృష్ణతో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నిందితుడిని చూపిస్తూ సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

మలుపు వద్ద కబళించిన మృత్యువు

- బైక్‌ను ఢీకొన్న బస్సు ఒకరి మృతి
- ఇద్దరికి తీవ్ర గాయాలు

నారాయణఖేడ్: బైక్‌ను బస్సు ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన నిజాంపేట్ మండలం మేఘ్యానాయక్ తండా దర్గా సమీపంలో 161బీ జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షోలాపూర్‌కు చెందిన నీలకంఠి విలాస్ (35) పెద్దశంకరంపేటకు చెందిన స్రవంతిని పదేళ్ళ క్రితం వివాహం చేసుకొని పెద్దశంకరంపేటలో మొబైల్ షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం నారాయణఖేడ్ నుంచి పెద్దశంకరంపేటకు మెదక్ మండలం కొత్తపేట్‌కు చెందిన ప్రవీణ్ (36), సురేశ్ (35)లతో కలిసి అతను బైక్‌పై వెళ్తున్నాడు. నిజాంపేట్ వైపు నుంచి నారాయణఖేడ్‌కు వస్తున్న యాదగిరిగుట్ట డిపోకు చెందిన బస్సు మలుపు వద్ద వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విలాస్ అక్కడికక్కడే మరణించాడు. మిగతా ఇద్దరికి తీవ్ర గాయాలపాలయ్యారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వీరిని ఖేడ్ ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. ఇందులో ప్రవీణ్ పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. విలాస్‌కు భార్య స్రవంతి, కుమారుడు, కుమార్తె ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.



విలాస్ (ఫైల్)

15 సార్లు వరించిన అవార్డులు

మరోసారి ఉత్తమ జిల్లా అధికారిగా జగత్‌కుమార్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉత్తమ జిల్లా అధికారిగా జిల్లా పశుగణాభివృద్ధి, పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ జగత్‌కుమార్‌రెడ్డి అందుకున్నారు. 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా, గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన వేడుకల్లో ఈ అవార్డును అందుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనురాధ ఉత్తమ జిల్లా అధికారిగా జగత్‌కుమార్‌రెడ్డికి అవార్డును, ప్రశంస పత్రాన్ని అందించారు.

● ఇప్పటి వరకు 3 రాష్ట్ర స్థాయి, 12 జిల్లా స్థాయి ఉత్తమ అధికారిగా అవార్డులను జేడీ జగత్‌కుమార్‌రెడ్డి పొందారు. సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్‌లో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు గాను నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్‌తో 2003లో రాష్ట్ర స్థాయి అవార్డు పొందారు. 2003లో సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్‌లను బ్యాంక్‌లతో లింక్ చేసినందుకు గాను నాటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో రాష్ట్ర స్థాయి అవార్డు పొందారు. 2017లో ఎస్‌బీఎం విభాగంలో నాటి తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ నుంచి రాష్ట్ర స్థాయి అవార్డును అందుకున్నారు. దీంతో పాటుగా జిల్లా స్థాయిలో 12 అవార్డులను అందుకున్నారు. కాగా, రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో ఏ శాఖలో విధులు అప్పగించిన వాటిని సక్రమంగా నిర్వహించడంలో జగత్‌కుమార్‌రెడ్డిది పెట్టింది పేరు. ముఖ్యంగా డీఆర్‌డీఓ, రూరల్ డెవలప్‌మెంట్, సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్, పశుసంవర్ధకశాఖ, బీసీ సంక్షేమశాఖ ఇలా ఏ శాఖలో విధులు నిర్వహించిన అన్నింటిలో తనదైన ముద్ర వేశారు. జాయింట్ డైరెక్టర్ జగత్‌కుమార్‌రెడ్డి మరో రెండు నెలల్లో పదవీ విరమణ చేయనున్నారు.



జిల్లా ఉత్తమ అధికారిగా అవార్డును అందుకుంటున్న జేడీ జగత్‌కుమార్‌రెడ్డి